నమస్తే తెలంగాణ
నిపుణ
Guide to Excellence
www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna
02.
nipuna
Every Wednesday Free Supplement
29 జనవరి 2025
పేజీలు 8

**యుద్ధ నౌకలు**

యుద్ధ నౌకలు ఐఎన్ఎస్ సూరత్, ఐఎన్ఎస్ నీలగిరి, జలాంతర్గామి ఐఎన్ఎస్ వాఘ్‌షీర్‌ను ప్రధాని మోదీ జాతికి అంకితం చేశారు. ఐఎన్ఎస్ సూరత్ పీ15బీ గైడెడ్ మిస్సైల్ డెస్ట్రాయర్ ప్రాజెక్ట్ కింద అభివృద్ధి చేస్తున్న నాలుగో యుద్ధనౌక. ఐఎన్ఎస్ నీలగిరి పీ17ఏ స్టెల్త్ ఫ్రిగేట్ ప్రాజెక్టులో తొలి యుద్ధనౌక. ఐఎన్ఎస్ వాఘ్‌షీర్ పీ75 కింద రూపొందిస్తున్న ఆరో, చివరి జలాంతర్గామి. ఫ్రాన్స్‌కు చెందిన నేవల్ గ్రూప్ సహకారంతో దీన్ని అభివృద్ధి చేశారు.

# నెట్ డిమాండ్ అండ్ టైమ్ లయబిలిటీస్ అంటే ఏమిటి?

**గ్రూప్స్ ప్రత్యేకం ఎకానమీ**

**ఆర్‌బీఐ ద్రవ్య విధానం**

- దేశ కేంద్ర బ్యాంక్ (ఆర్‌బీఐ) ద్రవ్య సరఫరాను నియంత్రించడానికి, వడ్డీరేట్లను ప్రభావితం చేయడానికి ప్రకటించే చర్యలను ద్రవ్య విధానం అంటారు.
- దేశంలో మూడు రకాల మార్గాల ద్వారా ద్రవ్యోల్బణ నియంత్రణ జరుగుతుంది.
  1) ప్రభుత్వ ప్రత్యేక చర్యలు
  2) కోశపరమైన చర్యలు (బడ్జెట్ ద్వారా)
  3) ఆర్‌బీఐ ద్రవ్యవిధానం

**ఆర్‌బీఐ ద్రవ్య విధాన లక్ష్యాలు**

1) దేశ ఆర్థిక వృద్ధి పెంచడం
2) ధరల స్థిరీకరణ
3) సంపూర్ణ ఉద్యోగిత సాధించడం
4) పొదుపు, పెట్టుబడులను ప్రోత్సహించడం
5) విదేశీ మారక రేటు స్థిరంగా ఉంచడం మొదలైనవి

**ఆర్‌బీఐ ద్రవ్యవిధానం 2 రకాలు**

1) **పరిమాణాత్మక చర్యలు** (Quatitative Measures)

ఎ. **సీఆర్ఆర్:** క్యాష్ రిజర్వ్ రేషియో (నగదు నిల్వల నిష్పత్తి). వాణిజ్య బ్యాంకులు ఒక ఆర్థిక సంవత్సరంలో డిపాజిట్ చేసిన సొమ్ము మొత్తంలో నిర్దిష్ట శాతం డిపాజిట్‌ను నగదు రూపంలో ఆర్‌బీఐ వద్ద నిల్వ ఉంచుతారు.

- ఆర్‌బీఐ-1934 చట్టం ప్రకారం ప్రవేశ పెట్టారు.
- 1956 నుంచి షెడ్యూల్డ్ బ్యాంకులపై విధిస్తున్నారు.
- సీఆర్ఆర్ అధికంగా ఉంటే వాణిజ్య బ్యాంకులు ప్రజలకు అందించే రుణాలు తగ్గి, ద్రవ్య సరఫరా తగ్గి, డిమాండ్ ధరలు ద్రవ్యోల్బణ రేటు తగ్గుతాయి.
- సీఆర్ఆర్ తక్కువగా ఉంటే రుణాలు పెరిగి, ద్రవ్య సరఫరా పెరిగి డిమాండ్, ధరలు, ద్రవ్యోల్బణ రేటు పెరుగుతుంది.
- ద్రవ్యోల్బణ రేటు అధికంగా ఉంటే ఆర్‌బీఐ సీఆర్ఆర్‌ను పెంచుతుంది. ప్రతి ద్రవ్యోల్బణ పరిస్థితుల్లో ఆర్‌బీఐ సీఆర్ఆర్‌ను తగ్గిస్తుంది.

బి. **చట్టబద్ధ ద్రవ్యత నిష్పత్తి (ఎస్ఎల్ఆర్- స్టాట్యుటరీ లిక్విడిటీ రేషియో):** ప్రతి షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకు తన వద్ద ఉన్న డిమాండ్, కాలపరపతి డిపాజిట్ల మొత్తంలో కొంత శాతాన్ని ప్రభుత్వ సెక్యూరిటీల్లో గాని, ప్రభుత్వ గుర్తింపు పొందిన సెక్యూరిటీల్లో గాని, బంగారంలో గాని తన వద్దనే నిల్వ చేయాలి. ఈ నిష్పత్తిని ఆర్‌బీఐ నిర్ణయిస్తుంది.

- ఎస్ఎల్ఆర్ రేటు ఎక్కువగా ఉంటే వాణిజ్య బ్యాంకులు అందించే రుణాలు తగ్గి, ద్రవ్య సరఫరా తగ్గి, ద్రవ్యోల్బణ రేటు తగ్గుతుంది.
- ఎస్ఎల్ఆర్ రేటు తక్కువగా ఉంటే రుణాలు అధికమై ద్రవ్య సరఫరా పెరిగి ద్రవ్యోల్బణ రేటు పెరుగుతుంది.

సి. **బ్యాంక్ రేటు:** షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంక్ దీర్ఘకాలిక అవసరాలకు ఆర్‌బీఐ నుంచి రుణాన్ని పొంది చెల్లించే వడ్డీరేటును బ్యాంక్ రేటు అంటారు.

- షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకులు తమ వద్ద గల బిల్స్‌ను ఆర్‌బీఐ వద్ద తాకట్టు పెట్టి లేదా డిస్కౌంట్ చేసి పొందే రుణాలపై విధించే వడ్డీరేట్లను బ్యాంక్ రేటు అంటారు.
- బ్యాంక్ రేటు అధికంగా ఉంటే వాణిజ్య బ్యాంకులు ఆర్‌బీఐ నుంచి తక్కువ రుణాలను సేకరించి ప్రజలకు అందించే రుణాలు తగ్గి, ద్రవ్య సరఫరా తగ్గి, ధరల స్థాయి తగ్గుతుంది.
- బ్యాంక్ రేటు తక్కువగా ఉంటే వాణిజ్య బ్యాంకులు ఆర్‌బీఐ నుంచి అధికంగా రుణాలను పొంది ప్రజలకు అధిక రుణాలను తక్కువ వడ్డీరేటుకు అందిస్తూ ద్రవ్య సరఫరా పెరిగి, డిమాండ్ అధికమై ద్రవ్యోల్బణం పెరుగుతుంది.

డి. **రెపోరేటు:** వాఘుల్ వర్కింగ్ గ్రూప్ సిఫారసులపై 1992లో ఆర్‌బీఐ ఈ విధానాన్ని ప్రవేశ పెట్టింది.

- వాణిజ్య బ్యాంకులు ద్రవ్యత్వం విషయంలో క్లిష్ట పరిస్థితిలో ఉన్నప్పుడు ఆర్‌బీఐ వద్ద రుణం తీసుకుంటాయి.
- వాణిజ్య బ్యాంకులు తమ వద్ద గల గవర్నమెంట్ సెక్యూరిటీస్‌ను ఆర్‌బీఐ వద్ద తాకట్టు పెట్టి రుణాలను సేకరిస్తాయి.
- వాణిజ్య బ్యాంకు తమ వద్ద గల ప్రభుత్వ సెక్యూరిటీస్‌ను ఆర్‌బీఐకు విక్రయించి నిర్దిష్ట కాల పరపతి అనంతరం తిరిగి కొనుగోలు చేస్తామని చేసుకున్న ఒప్పందం.
- ప్రస్తుతం వాణిజ్య బ్యాంకులు ఎక్కువగా ఈ విధానాన్ని ఉపయోగిస్తున్నాయి. దీనికి కారణం బ్యాంకు రేటు వడ్డీరేటు కంటే రెపో రేటు వడ్డీరేటు తక్కువ.
- రెపో వడ్డీ రేట్లు ఎక్కువగా ఉంటే వాణిజ్య బ్యాంకు ఆర్‌బీఐ నుంచి తక్కువ నిధులను సేకరిస్తాయి. అంటే వాణిజ్య బ్యాంకు ప్రజలకు అందించే రుణాలు తగ్గి, ద్రవ్యసరఫరా తగ్గి ద్రవ్యోల్బణ రేటు తగ్గుతుంది.

ఇ. **రివర్స్ రెపో రేటు (ఆర్ఆర్ఆర్):** వాఘుల్ వర్కింగ్ గ్రూప్ సిఫారసులపై 1996లో ఆర్‌బీఐ ఈ విధానాన్ని ప్రవేశ పెట్టింది.

- వాణిజ్య బ్యాంకులు తమ దగ్గర అదనపు నగదు నిల్వలు ఉన్నప్పుడు వాటిని ఆర్‌బీఐ వద్ద డిపాజిట్ చేయవచ్చు. అలాంటి డిపాజిట్ల మీద ఆర్‌బీఐ చెల్లించే వడ్డీరేటును 'రివర్స్ రెపో రేటు' అంటారు.
- ఈ వడ్డీ రేటును ఆర్‌బీఐ నిర్ణయిస్తుంది.
- ఈ వడ్డీ రేటు విధానంలో ఆర్‌బీఐ తన దగ్గర గవర్నమెంట్ సెక్యూరిటీస్‌ను వాణిజ్య బ్యాంకుకు తాకట్టు పెట్టి రుణాలను సేకరిస్తుంది.
- ద్రవ్యోల్బణ రేటును తగ్గించడానికి రివర్స్ రెపో రేటు పెంచాలి.
- ద్రవ్యోల్బణ రేటును పెంచడానికి లేదా ప్రతి ద్రవ్యోల్బణ పరిస్థితుల్లో రివర్స్ రెపో రేటు తగ్గించాలి.

ఎఫ్. **బహిరంగ మార్కెట్ వ్యవహారాలు (ఓపెన్ మార్కెట్ ఆపరేషన్స్):** ఆర్‌బీఐ ప్రభుత్వ సెక్యూరిటీలను విక్రయించడం, తిరిగి కొనుగోలు చేయడాన్ని బహిరంగ మార్కెట్ వ్యవహారాలు అంటారు.

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్‌బీఐ ద్వారా రుణాలను సేకరించడానికి గవర్నమెంట్ సెక్యూరిటీస్, ట్రెజరీ బిల్లులను బహిరంగ మార్కెట్‌లో జారీ చేస్తాయి. ఆర్‌బీఐ బహిరంగ వేలాన్ని తన ఆన్‌లైన్ ప్లాట్‌ఫాం అయిన ఈ-కుబేర్ ద్వారా నిర్వహించి తక్కువ వడ్డీరేటు పాడిన వారికి కేటాయిస్తుంది.
- వేలంలో అన్ని వర్గాలు పాల్గొనవచ్చు. కానీ దేశంలో ఈ మార్కెట్ అభివృద్ధి చెందలేదు.

జి. **మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ:** ఈ విధానాన్ని 2011లో ప్రవేశ పెట్టారు. షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకులు అతి స్వల్పకాలిక రుణాలు పొందడానికి ఈ విధానాన్ని ప్రవేశ పెట్టారు.

- వాణిజ్య బ్యాంకులు తీవ్ర ద్రవ్యత కొరత ఎదుర్కొంటున్న పరిస్థితిలో ఈ సౌకర్యం ఉపయోగించుకోవచ్చు.
- తమ నికర డిమాండ్‌లో నెట్ డిమాండ్ అండ్ టైం లయబిలిటీస్ (ఎన్‌డీటీఎల్)పై 2 శాతం పరిమితి వరకు రుణాన్ని తీసుకోవచ్చు.
- ఎన్‌డీటీఎల్ అంటే బ్యాంకు ప్రజల నుంచి సేకరించిన మొత్తం డిపాజిట్ల నుంచి వేరొక బ్యాంకులో డిపాజిట్ చేసిన నగదును తీసివేయగా లభించే విలువ.
- 2020, మార్చిలో తాత్కాలిక ప్రాతిపదికన కేంద్ర బ్యాంకు ఎంఎస్ఎఫ్ పరిమితిని 2 శాతం నుంచి 3 శాతానికి పెంచారు.



హెచ్. **స్టాండింగ్ డిపాజిట్ ఫెసిలిటీ:** ఈ విధానం ఆర్‌బీఐ 2022లో ప్రవేశ పెట్టారు. ఈ విధానంలో ప్రభుత్వ సెక్యూరిటీలను ఇవ్వాల్సిన అవసరం లేకుండా బ్యాంకుల నుంచి ద్రవ్యాన్ని కేంద్ర బ్యాంకు పొందుతుంది.

- వాణిజ్య బ్యాంకులు తమ వద్ద అదనంగా గల ద్రవ్యాన్ని కేంద్ర బ్యాంక్ వద్ద డిపాజిట్‌గా ఉంచే ఈ డిపాజిట్లపై రివర్స్ రెపో రేటు కంటే అధిక వడ్డీ లభిస్తుంది.

| పరిమాణాత్మక చర్యలు | వడ్డీరేటు (ప్రస్తుతం) |
|---|---|
| 1) నగదు నిల్వల నిష్పత్తి | 4 శాతం |
| 2) చట్టబద్ధ ద్రవ్యత నిల్వల నిష్పత్తి | 18 శాతం |
| 3) బ్యాంక్ రేటు | 6.75 శాతం |
| 4) రెపో రేటు | 6.50 శాతం |
| 5) రివర్స్ రెపో రేటు | 3.35 శాతం |
| 6) మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ | 6.75 శాతం |
| 7) స్టాండింగ్ డిపాజిట్ ఫెసిలిటీ | 6.25 శాతం |

**గుణాత్మక చర్యలు** (Qualitative Measures)

- పరిమాణాత్మక పరపతి నియంత్రణ పద్ధతుల వల్ల ఆర్థిక వ్యవస్థ మొత్తంలో అన్ని రంగాలకు లభించే పరపతి పరిమాణం మారుతుంది. రుణ అవసరాల మధ్య, రంగాల మధ్య విచక్షణ ఉండదు. దీనివల్ల పరపతిని తగ్గించే చర్యలు తీసుకున్నప్పుడు వ్యవసాయం, చిన్న పరిశ్రమలు, స్వయం ఉపాధి పథకాలు, చేతివృత్తుల వారు మొదలైన వారికి పరపతి లభించడం కష్టం కావచ్చు. అందువల్ల ఆర్‌బీఐ కింది విధంగా కొన్ని గుణాత్మక పరపతిని నియంత్రణ పద్ధతులను పాటిస్తుంది.

1) **పరపతి రేషనింగ్** (Credit Rationing)

- ఈ పద్ధతిలో వేర్వేరు అవసరాలకు వేర్వేరుగా పరపతిపై గరిష్ఠ పరిమితులను విధించవచ్చు. దీన్ని రేషనింగ్ అంటారు. అదేవిధంగా రంగాలకు కోటాలు నిర్ణయించవచ్చు.

**ఉదా:** ప్రాధాన్య వర్గానికి 40 శాతం నిర్ణయిస్తారు.

2) **మార్జిన్ల విధింపు**

- ఒక అవసరం కోసం ఖాతాదార్లు రుణం తీసుకున్నప్పుడు ఆ అవసరం విలువలో కొంత శాతం అతను చెల్లిస్తే మిగతా మొత్తం రుణంగా ఇస్తుంది. ఖాతాదారు తన నిధుల నుంచి చెల్లించాల్సిన మొత్తాన్ని మార్జిన్ అంటారు.

3) **వ్యత్యాస వడ్డీ రేట్ల మార్పు** (Differential Interest Rates)

- వివిధ అవసరాలకు వేర్వేరుగా వడ్డీ రేట్లను నిర్ణయించవచ్చు. వడ్డీ రాయితీల రూపంలో కూడా ఈ తేడా చూపిస్తుంది.

**ఉదా:** రైతులకు పావలా వడ్డీ రేట్ల విధానం.

4) **నైతిక బోధన** (Moral Suasion)

- ఆర్‌బీఐ బ్యాంకులకు సలహాలు, సూచనలు అందిస్తుంది.

5) **ఆదేశాలు జారీ చేయడం**

- పరపతి విషయంలో వాణిజ్య బ్యాంకులకు ఆర్‌బీఐ స్పష్టమైన, కచ్చితమైన ఆదేశాలు జారీ చేయవచ్చు. వాటిని పాటించకపోతే వాణిజ్య బ్యాంకులపై చర్యలు కూడా తీసుకోవచ్చు.

## మాదిరి ప్రశ్నలు

1. బ్యాంకింగ్ నియంత్రణ చట్టం- 1949 ఎవరికి విస్తృతమైన నియంత్రణ అధికారాలను కట్టబెట్టింది?
   1) స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
   2) భారత ప్రభుత్వం
   3) ఆర్‌బీఐ
   4) అన్ని జాతీయ బ్యాంకులు
2. కింది వాటిలో భారతీయ రిజర్వ్ బ్యాంక్ పని కానిది?
   1) కార్పొరేట్ సంస్థలకు రుణాలు ఇవ్వడం
   2) కరెన్సీ నోట్లు జారీ చేయడం
   3) ప్రభుత్వానికి బ్యాంకర్
   4) బ్యాంకులకే బ్యాంక్
3. కేంద్రీయ బ్యాంక్ బహిర్గత మార్కెట్ కార్యకలాపాలకు సంబంధించినది ప్రభుత్వ సెక్యూరిటీల ....
   1) కొనుగోలు
   2) అమ్మకం
   3) ఇవ్వకుండటం
   4) అమ్మకం, కొనుగోలు
4. ఆర్‌బీఐ ఇతర వాణిజ్య బ్యాంకులకు ఇచ్చే వడ్డీ రేటును ఏమంటారు?
   1) రేట్ ఆఫ్ ఇంట్రస్ట్
   2) రెపో రేటు
   3) క్రెడిట్ రేటు
   4) ప్రైవేటుకాదు
5. ఆర్‌బీఐ వద్ద తప్పనిసరిగా నగదు నిల్వలుగా ఉంచుకోవాల్సిన డిపాజిట్ల శాతం?
   1) నగదు నిల్వల నిష్పత్తి
   2) పరపతి నిష్పత్తి
   3) లిక్విడిటీ సర్దుబాటు సౌకర్యం
   4) డిపాజిట్ నిష్పత్తి
6. కింది వాటిలో ఏది సెంట్రల్ బ్యాంక్ ద్రవ్య నియంత్రణ సాధన కాదు?
   1) ఓపెన్ మార్కెట్ కార్యకలాపాలు
   2) దేశ విదేశీ కరెన్సీ నిల్వల సంరక్షకులు (కస్టోడియన్)
   3) రీ ఫైనాన్సింగ్ రేటు
   4) రిజర్వ్ అవసరాలు
7. ఆర్‌బీఐ నగదు నిల్వల నిష్పత్తిని తగ్గిస్తే క్రెడిట్ నిర్మాణం?
   1) పెరుగుతుంది 2) తగ్గుతుంది
   3) వడ్డీ రేట్లు తగ్గుతాయి
   4) ఏ ప్రభావం ఉండదు
8. దేశంలోని వాణిజ్య బ్యాంకులు కస్టమర్ డిపాజిట్లు, డిస్కౌంట్ బిల్స్ మధ్య నిర్వహించే నిష్పత్తిని ఏమంటారు?
   1) ద్రవ్యత్వపు నిష్పత్తి
   2) పరపతి డిపాజిట్ల నిష్పత్తి
   3) అభిలషణీయ రిజర్వ్ నిష్పత్తి
   4) కనిష్ఠ రిజర్వ్ నిష్పత్తి
9. చట్టబద్ధమైన లిక్విడిటీ నిష్పత్తిని బ్యాంకులు ఏ రంగంలో నిర్వహించాలి?
   ఎ. నగదు బి. బంగారం
   సి. నిర్దేశిత సాధనాల్లో భారం లేని పెట్టుబడులు
   డి. ప్రాధాన్య రంగాలకు రుణాలు
   1) బి, సి, డి 2) ఎ, సి, డి
   3) ఎ, బి, డి 4) ఎ, బి, సి
10. దేశంలోని ఆర్థిక రంగం కింది ఏ సంస్థ నియంత్రిస్తుంది?
   1) ఫైనాన్స్ కమిషన్
   2) ఆర్థిక మంత్రిత్వ శాఖ
   3) ఆర్‌బీఐ 4) సెబీ

**సమాధానాలు**

| | | | |
|---|---|---|---|
| 1-3, | 2-1, | 3-4, | 4-2, |
| 5-1, | 6-2, | 7-1, | 8-1, |
| 9-4, | 10-3. | | |



పన్నాల శ్రవణ్ కుమార్
ఎకనామిక్స్ ఫ్యాకల్టీ,
9866709280
హైదరాబాద్